
సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి

ఎంపీ ఎన్నికల్లో విజయం కోసం పని చేయాలి

నల్లకుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో ఈనెల 27న మహారాణా ప్రతాప్ ఫంక్షన్‌హాల్‌లో అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సమావేశం నిర్వహించనున్నారు. దీనికి మాజీమంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న నేపథ్యంలో ముఖ్య నాయకుల జనసమీకరణకు సంబంధించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వి.వెంకటరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, మోర శ్రీరాములుముదిరాజ్, మహేందర్‌రెడ్డి, కనివేటి నర్సింగ్‌రావు, మిరియాల రవీందర్, భుజంగం గెల్యాయ్య, సంజీవ్‌గౌడ్ పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ సూచించారు. ఆదివారం కవాడిగూడ, దోమలగూడ కిడ్‌హార్ట్ ప్లే స్కూల్‌లో బిద్రిలాల్ పన్నాలాల్ పిట్టి ట్రస్ట్, అగర్వాల్ సమాజ్ తెలంగాణ శాఖ, అగర్వాల్ సమాజ్ హెల్త్ క్లినిక్, భగవాన్ మహావీర్ వికలాంగ్ సహాయక సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 124వ మహాహెల్త్ క్యాంపును కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచిత వైద్యశిబిరాలను పేదలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రదీప్ అగర్వాల్, సుధీర్‌గుప్తా, దేవేందర్‌అగర్వాల్, విజయ్‌కుమార్, రష్మీ అగర్వాల్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, కవాడిగూడ బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, ఎస్సీ మోర్చా ముషీరాబాద్ కన్వీనర్ పి.వరకుమార్, రమేష్‌బాబు, శివరాజ్, అనిల్, అనురాగ్ అగర్వాల్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో మంచినీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. ఆదివారం డివిజన్‌లోని నింబోలిఅడ్డ, సూర్యనగర్, అంబాజీ వీధి ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు ఆమె అడిగి తెలుసుకున్నారు. మంచినీటి ఎద్దడిపై ప్రజలు ఆమెకు ఫిర్యాదు చేశారు. జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆమె వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, సుభాష్‌పటేల్, బీబీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్ పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని అర్హులైన వారికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల సోమవారం ఉదయం 11 గంటలకు పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు.

దళితులకు రిజర్వేషన్లు అమలు చేయాలి


ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్షలో గుంధం సుమన్ మాదిగ తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దళితులకు 18 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గుంధం సుమన్‌మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద దళితులకు 18 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సుమన్ మాదిగ మాట్లాడుతూ.. దళితుల్లో పెరిగిన జనాభా అనుగుణంగా 18 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ ద్వారా ఎస్సీ, ఉద్యోగ, ఉపాధి, అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తే దళితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి శ్రీకాంత్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండి అజయ్‌మాదిగ, రాష్ట్ర నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ

రాష్ట్రంలో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత కోర్టుల్లో కేసులు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కారం చేయడానికి కిందిస్థాయి కోర్టులను ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు కోరారు. ఆదివారం గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ విద్యార్థుల సదస్సు నిర్వహించారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, న్యాయవాది శైలజ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, నాయకులు రమ్య, విగ్నేష్, స్టాలిన్, టి.నాగరాజు, డి.ప్రశాంత్, శ్రీకాంత్ మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం తరహా న్యాయ విద్యార్థులు, న్యాయవాదులకు రూ.15 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి



బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని మహిళను రైలు ఢీకొనడంతో ఆమె చెందింది. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వి.లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. జామైఉస్మానియా - విద్యానగర్ రైల్వేస్టేషన్ల నడుమ 55 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మహిళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి ఒంటిపై ఆరెంజ్ రంగు చీర, పసుపు రంగు జాకెట్ ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణవాదులకు ఎంపీ టికెట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న రంగయ్య

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పర్యావరణవాదులకు ఎంపీ టికెట్లు కేటాయించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది. కౌన్సిల్ అధ్యక్షుడు సీహెచ్.రంగయ్య ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఓటు బ్యాంకు రాజకీయాలకు అలవాటుపడ్డ పార్టీలు సకల జీవరాశి మనుగడకు అవసరమైన ప్రకృతి, పర్యావరణం గురించి ఆలోచించడం మర్చిపోయాయని విమర్శించారు. పర్యావరణం అంటే సామాజిక సుస్థిరత అని, తాము పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని పార్టీలు ఈ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో కనీసం ఒక సీటు అయినా పర్యావరణ ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

- అనుమతి తీసుకుని నిర్మాణాలు చేపట్టాలి
- ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కూల్చివేత తప్పదు
- ముషీరాబాద్ సర్కిల్-15 జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్‌గౌడ్

ఇంటర్వ్యూ



రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఇటీవల అధికారుల బదిలీల్లో భాగంగా ముషీరాబాద్ సర్కిల్-15 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్ బదిలీకాగా ఆయన స్థానంలో కూకట్‌పల్లి ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌గౌడ్ ముషీరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనతో 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించింది. టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన వివరాలు..

ఆంధ్రజ్యోతి: ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయా? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ: ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఎవరైనా ఇళ్ల నిర్మాణాలు చేస్తే తప్పనిసరిగా జీహెచ్ఎంసీ అనుమతి తీసుకొని నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలి. అనుమతులకు విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: నిర్మాణ అనుమతులు విర్లీత సమయంలో ఇస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ: జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణ కోసం అనుమతులు తీసుకున్న యజమానులు నిర్ణీత గడువులోగా అనుమతులు ఇస్తున్నాం. ఇప్పుడు ఆన్‌లైన్‌లో సరైన పత్రాలు పొందుపర్చక పోతే అనుమతులు రద్దు చేస్తాం. నిర్మాణదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటారు కాబట్టి వాటిని తాము పరిశీలించి గడువులోపు అనుమతులు

ఆంధ్రజ్యోతి: ఫుట్‌పాత్ ఆక్రమణలు చాలా ఉన్నాయి. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ: పాదచారులు నడిచేందుకు వీలుగా ప్రధాన రహదారులలో ఫుట్‌పాత్‌లను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. ఫుట్‌పాత్‌లపై డబ్బాలు, ఇతర నిర్మాణాలు చేసినా.. దుకాణ యజమానులు ఆక్రమించిన కఠిన చర్యలు తీసుకుంటాం. ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఉపయోగపడేలా వ్యాపారస్తులు సహకరించాలి. లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి: అక్రమ సెల్లార్ ఆదనపు అంతస్తుల నిర్మాణాలపై దృష్టి సారిస్తున్నారా?

టౌన్‌ప్లానింగ్ ఏసీపీ: అనుమతులు లేకుండా ఎవరు సెల్లార్లు నిర్మించినా చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా ఎవరూ సెల్లార్లు నిర్మించొద్దు. ఆదనపు అంతస్తుల నిర్మించడం జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధం. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే ఊరుకోం. అనుమతులు లేని సెల్లార్లు, అదనపు అంతస్తుల వివరాలు ఏమైనా ఉంటే తమ దృష్టికి వస్తే వాటిపై తప్పక చర్యలు తీసుకుంటాం.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 5 వేల కోట్ల విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 లక్షల మంది ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ, డిగ్రీ విద్యార్థులకు మూడేళ్ల నుంచి ఫీజు బకాయిలు ఇవ్వకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయని, కొన్ని కళాశాలలు విద్యార్థులు తరగతులకు హాజరుకానివ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఫీజుబకాయిలు చెల్లింపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి బకాయిలు విడుదల చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, సి.రాజేందర్, మధుసూదన్, అనంతయ్య, అంజయ్య, జక్కుల యాదవ్, నర్సింహగౌడ్, వేముల రామకృష్ణ, టీఆర్.చందర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రోలో నగదు, నగలు చోరీ

యూసుఫ్‌గూడ: మెట్రోలో చోరీ జరిగింది. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిషేక్ అభిదత్త ఈనెల 13న ఎర్రమంజిల్ నుంచి అమీర్‌పేటకు మెట్రో రైలులో ప్రయాణించారు. అమీర్‌పేటలో దిగి పర్సు చూసుకోగా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఆదేరోజు ఫిర్యాదు చేశారు. పర్సులో రూ. 1,200, రూ. 50 వేల విలువగల గోల్డ్‌చైన్ ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసును మధురానగర్ పీఎస్‌కు ఆదివారం బదిలీ చేశారు.

కేంద్రంలో రామరాజ్యం పేరుతో రాక్షస పాలన


కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఇంక్విలాబ్ సేన కార్యకర్తలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హామీలను అమలు చేయాలని రైతులు ప్రజాస్వామ్యయుతంగా ఆందోళనలు చేస్తుంటే కాల్చి చంపడం దుర్మార్గమని, మోదీ ప్రభుత్వం రామరాజ్యం పేరుతో రాక్షస పాలన అమలు చేస్తోందని ఇంక్విలాబ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ జానీ ఉమర్, ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.హస్నీలు ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మోదీ ప్రభుత్వం చంపిన రైతు శుభకరణ్‌సింగ్ హత్యను ఖండిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు చేసిన పోరాటానికి తలొగ్గిన మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసినందుకు, కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కాసాని శ్రీనివాస్, ఆసియా, సలీం, సిరాజ్, అమీనా, పర్వాన తదితరులు పాల్గొన్నారు.

మేయర్ బీఆర్ఎస్.. డిప్యూటీ మేయర్ కాంగ్రెస్..!

(5వ పేజీ తరువాయి)

పాలనాపరంగానూ బీఆర్ఎస్ మేయర్‌కు అధికారుల సహకారం పూర్తిస్థాయిలో అందకుండా ప్రభుత్వపరంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల అధికారులు టార్గెట్‌గా పాలకమండలి సభ్యులు మండిపడ్డారు. డిప్యూటీ మునిసిపల్, జోనల్ కమిషనర్ల వైఖరిని ప్రస్తావిస్తూ పలుకులు కమిషనర్ తీరునూ ఎండగట్టారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ తరఫున కార్పొరేటర్లు మాత్రమే ఉండగా.. ఇప్పుడు డిప్యూటీ మేయర్ తోడయ్యారు. దీంతో సభలో మరో అధికార కేంద్రం మొదలయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఆరుకు ముందు నామ్ కే వాస్తే అన్నట్టుగా ఉన్న శ్రీలతారెడ్డి.. అధికార పార్టీలో చేరిన దృష్ట్యా.. ఇక సమీక్షలు, సమావేశాలు నిర్వహించవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తుత బలాబలాలు	
పార్టీ	సభ్యులు
బీఆర్ఎస్	52
ఎంఐఎం	42
బీజేపీ	40
కాంగ్రెస్	12
మొత్తం	147
(ఖాళీగా మూడు స్థానాలు)	

అవిశ్వాసం పెట్టలేరు

2020 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ 56 స్థానాల్లో గెలిచింది. బీజేపీ నుంచి ఆరుగురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ కార్పొరేటర్ ఒకరు గులాబీ పార్టీలో చేరారు. అయినా, ప్రస్తుతం కౌన్సిల్‌లో ఆ పార్టీ బలం 52కు తగ్గింది. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన 10 మంది కార్పొరేటర్లు హస్తం గూటికి చేరడమే ఇందుకు కారణం. కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 12కు పెరిగింది. గులాబీ పార్టీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లు త్వరలో అధికార పార్టీ తీర్థం పుచ్చుకుంటారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే మరో ఏడాది తర్వాత బీఆర్ఎస్ బలం ఎంతుంటుందన్నది వేచిచూడాలి. పరిస్థితి. బీజేపీ సభ్యుల సంఖ్య 40, ఎంఐఎం సంఖ్య 42గా ఉంది. బీజేపీకి చెందిన ఓ కార్పొరేటర్ మృతి చెందారు.. ఎంఐఎం నుంచి ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పురపాలక శాఖ చట్టం ప్రకారం మూడేళ్ల అనంతరం అవిశ్వాసం పెట్టే అవకాశముంది. గతంలో దీనిని నాలుగేళ్లకు సవరిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్‌కు ప్రతిపాదన పంపింది. ఆమె ఫైలును వెనక్కి పంపడంతో చట్ట సవరణ జరగలేదు. గతంలో గవర్నర్ తిరస్కరించిన పత్రంలో ప్రస్తుతం మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అవిశ్వాసానికి అవకాశం ఉండేది కాదు.

నిలిచి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

- అక్కడికక్కడే ఒకరి మృతి, నలుగురికి గాయాలు
- నల్లగొండ జిల్లా కట్టంగూరులో ఘటన


ట్యాంకర్ కిందికి దూసుకెళ్లిన కారు

కట్టంగూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కట్టంగూరు మండల పరిధిలోని 65వ నెంబరు జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ట్యాంకర్‌ను అతివేగంతో కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి కట్టంగూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్(ఎల్‌బీనగర్) అలకాపురి కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గోవింద్ బాలయ్య(50) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున ఏపీ28డీఎన్ 9972 కారులో సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ఎర్రవరం లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి బయలుదేరారు. తమ్ముడి కుమార్తె ఆరోగ్యంగా ఉండటంతో దేవాలయానికి వెళ్తున్నారు. ఇందుకోసం అపార్ట్‌మెంట్‌కు చెందిన ఓ వ్యక్తికి చెందిన కారుకు బాలయ్య ఇద్దరు కుమారుల్లో పెద్దవాడైన, డ్రైవర్‌గా పనిచేస్తున్న లింగస్వామి వెంటవచ్చాడు. బాలయ్య ముందు సీట్లో కూర్చోగా, లింగస్వామి వాహనం నడుపుతున్నాడు. బాలయ్య తమ్ముడు కుమార్తె చందన, లింగస్వామి కుమారుడు నవీన్, కుమార్తె అంక్షితలు వెనుక కూర్చున్నారు. కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం వద్ద అతివేగంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో రహదారికి ఎడమవైపు దూసుకెళ్లింది. ఈ క్రమంలో హైవే పక్కన వాహనాల విశ్రాంతి ప్రదేశంలో నిలిపి ఉన్న ట్యాంకర్‌ను వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జయి బాలయ్య అక్కడికక్కడే మృతిచెందగా, వాహనం నడుపుతున్న లింగస్వామి, ఆయన కుమారుడు నవీన్, కుమార్తె అంక్షిత, ఆయన బాబాయ్ కుమార్తె చందనలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నార్కట్‌పల్లి సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. బాలయ్య మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా బాలయ్య భార్య, కోడలు ఇంటి వద్దనే ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

● సీఎంకు సత్కారం



బీసీ కులగణన చేపడుతున్నట్లు ప్రకటించినందుకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరిస్తున్న అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ యాదగిరిగౌడ్.

\- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

హజ్‌యాత్రకు 7,811 మంది ఎంపిక

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ


సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి 7,811 మంది హాజీలు వెళ్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఈసారి 11,313 మంది దరఖాస్తు చేసుకున్నారని, హజ్ కమిటీ కోటాలో 7,811 మంది ఎంపికయ్యారని ఆయన చెప్పారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేటలో తెలంగాణ హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికుల కోసం నిర్వహించిన మొదటి అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారి కోసం సౌదీ అరేబియాలోని మక్కాలో రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ ద్వారా భవనం, ఉండేందుకు వసతులు కల్పిస్తున్నామన్నారు. 7,811 మంది హాజీలు హైదరాబాద్‌కు చెందిన వారు 4వేల మందిపైగా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుస్సేని తెలిపారు. మొదటి విడతగా రూ.80,800 చెల్లించాల్సి ఉండగా ఎంపికైన 1,316 మంది చెల్లించకపోవడంతో వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టామని, రెండో విడతగా రూ.1.70 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ రెండు వాయిదాలు కలిపి మార్చి 10న రాష్ట్ర హజ్ కమిటీకి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సౌదీ ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చాక మూడో విడత చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. ఒక్కో హజ్ యాత్రికునికి రూ.3.50 లక్షల వరకు ఖర్చవుతుందని సూచనప్రాయంగా తెలిపారు. వచ్చే మే 9 నుంచి హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బలాల, టీపీసీసీ కార్యదర్శి మహ్మద్‌పాద్ పాల్గొన్నారు.

అశోక్‌నగర్ చౌరస్తాలో రోడ్డు మూసివేతతో ఇబ్బందులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ చౌరస్తాలో ఐదు రోజులుగా రోడ్డు మూసివేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అశోక్‌నగర్ చౌరస్తా నుంచి వీవీఎస్ హైస్కూల్ వరకు తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో రెండు రోజులుగా అశోక్‌నగర్ చౌరస్తాలో రోడ్డును మూసివేసినట్లు చిక్కడపల్లి ట్రాఫిక్‌పోలీసులు తెలిపారు. ఐదులో జలుగా గడిచినప్పటికీ కూడా రోడ్డు మూసివేత కొనసాగుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

మహాశివరాత్రి సందర్భంగా విశ్లేషణాత్మక ప్రసంగం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ కేంద్రం ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు విశ్లేషణాత్మక ప్రసంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్రం హెడ్ జయశ్రీ తెలిపారు. శ్రీమద్భగవద్గీత, శ్రీకృష్ణ అనుభూతి విషయమైన్నా గీతాతత్వ నిపుణులు, ఎన్ఐఆర్ రిటైర్డ్ మేనేజర్ రాజయోగి బీకే త్రినాథ్ ప్రవచనం చెబుతారన్నారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ప్రతిరోజు సా.6 నుంచి 7.30 గంటల వరకు ప్రవచనం ఉంటుందన్నారు.

డబ్ల్యూటీవో నుంచి భారత్ బయటకు రావాలి


ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీ.సాగర్, ప్రభాకర్‌రావు తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డబ్ల్యూటీవో నుంచి భారతదేశం బయటకు రావాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీ నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టీ.సాగర్, విస్సా కిరణ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, ఆర్.వెంకటరాములు, గౌని ఐలయ్య, డేవిడ్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. డబ్ల్యూటీవో నుంచి భారతదేశం బయటకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెజీరామచందర్, ఎం.శ్రీనివాస్, హన్మేష్, అరుణ, అనురాధ, సీతారామయ్య, శంకర్, కోట రమేష్, ప్రవీణ్, జి.శ్యాం పాల్గొన్నారు.

సుదర్శన, మహామృత్యుంజయ హోమాలు


సుదర్శన హోమంలో ఆర్యవైశ్య ఫ్యామిలీ వెల్ఫేర్ సుప్పా శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ ఆర్యవైశ్య ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఆదివారం జెమినికాలనీలోని శివాలయం ఆవరణలో గణపతి, సుదర్శన, మహామృత్యుంజయ హోమాలు నిర్వహించారు. ఈ హోమాల్లో ఆర్యవైశ్య కుటుంబాలు పాల్గొన్నాయి. హోమం అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వి.సుదాకర్ గుప్తా, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, నేతి సత్యనారాయణ, కెరాజశేఖర్‌గుప్తా, సత్యవర్ధన్, గంపవల్లేశం, శంకరయ్య, రామనాథం, రఘురాములు, ఎర్రం చంద్రశేఖర్, ఎర్రం రమేష్, శ్రీనివాస్, ప్రకాష్, రమేష్‌రాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ హోమం నిర్వహించామన్నారు.

ప్రయోగాలు ప్రజలకు ఉపయోగపడాలి

- జాతీయ సైన్స్ దినోత్సవంలో పలువురు వక్తలు



వేడుకల్లో అల్లాడ్ హుస్సేన్, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లు

రాంనగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగపడని ఏ ప్రయోగమూ పనికిరాదని లార్డ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అల్లాడ్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నిరంతరం పిల్లల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందిస్తేనే, సత్యాన్ని శోధించే పద్ధతి తెలంగాణ బాలోత్సవం కృషి చేస్తోందని ఆయన అన్నారు. డాల్టా వంటి హానికర ఆయిల్ ప్రమాదం మొత్తం నిషేధించిన, మనుషులకు హాని చేసే మందులు అనేకం నిషేధించినా మనదేశంలో మాత్రం అమ్ముతున్నారని వాపోయారు. సైన్స్ ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని, శాస్త్రీయ ఆలోచన అనే లక్ష్యంతో పిల్లల్లో సైన్స్ అవగాహన కల్పించి మూఢవిశ్వాసాల పారద్రోలాలని పిలుపునిచ్చారు. కవి ఏనుకు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా సైన్స్ ప్రయోగాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్ష, కార్యదర్శులు బాపతి వెంకటేశ్వర్లు, సోమయ్య, ఉపాధ్యాయులు కెసుజాత, మమత, దుసరకర్తి, జి.బుచ్చిరెడ్డి, కేయవెంకటేశ్వర్లు, సి.వీహారిక్షక్త, శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్ విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన సింగరేణి బొగ్గుగని నమూనా, గుండె పనితీరు వివరణ, ఆయుర్వేద జెట్ నుంచి ఆయిల్ తయారీ ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు.

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కేంద్రం కుట్ర


మాట్లాడుతున్న డాక్టర్ పీవీఎల్.రాజా

కవాడిగూడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ద్వారా చేసి మోదీ ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు తెర తీసిందని సిద్ధం కావాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎల్.రాజు పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా దళితులను అణిచివేయాలని రాజ్యాంగాలను రాసేస్తుండాలని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. 19 ఏళ్లక్రితం సుప్రీంకోర్టు కొట్టివేసిన ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నేడు మనువాద ప్రభుత్వం సుప్రీంకోర్టు ద్వారా వర్గీకరణ చేయాలని చూస్తున్నదన్నారు. బీజేపీ రాజకీయ లబ్ధి కోసం దళిత జాతుల విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై జాతీయస్థాయిలో పోరాటం తప్పదన్నారు. వర్గీకరణకు మద్దతుగా గత అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొన్నలగడ్డ బాస్కర్‌రావు, అర్జల రాజు, నక్కా దేవేందర్, ఎలిజాల ప్రవీణ్ పాల్గొన్నారు.